క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



బాన్సువాడ: బీర్కూర్ మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఎంపీడీవో భానుప్రకాష్ పరిశీలించారు. రైతునగర్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి వసతులపై ఆరా తీశారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. వంద శాతం పోలింగ్ అయ్యేలా చూడాలని అన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం



బాన్సువాడ: బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపార వేత్త నార్ల భరత్‌రాజ్ గుప్తా తన ముగ్గురు కుమార్తెలు ఏర్పాటు చేసిన త్రీ సిస్టర్ ఫౌండేషన్ పేరిట పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూర్బాలో విద్యనభ్యసిస్తున్న 23 మంది పేద విద్యార్థులకు రూ.వెయ్యి చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్, ఎంపీపీ రఘు, జెడ్పీటీసీ స్వరూప, తదితరులు ఉన్నారు.

గాయపడ్డ యువకుడికి..

భిక్కనూరు: మండల కేంద్రానికి చెందిన నవీన్ బైక్‌పై వెళ్తుండగా ఫిట్స్ రావడంతో కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. నవీన్ నిరుపేద కావడంతో మాజీ మంత్రి షబ్బీర్ అలీ వెంటనే రూ.5 వేలు పంపించారు. సాయాన్ని కాంగ్రెస్ నేతలు అందించారు. పీసీసీ ప్రధానకార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని జిల్లా చెక్ పోస్టు వద్ద పోలీసులు వాహనాల తనిఖీని పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. ఆధారాలు లేని డబ్బులను తరలిస్తే సీజ్ చేస్తున్నారు. రూ.50 వేల కన్నా ఎక్కువ ఉంటే సీజ్ చేసి ఎఫ్‌డీసీకి అప్పగిస్తామని పోలీసులు తెలిపారు.

పౌష్టికాహారం ఇవ్వాలి



నిజాంసాగర్(జుక్కల్): అంగన్‌వాడి కేంద్రాలకు వచ్చే పిల్లలతో పాటు తల్లిబిడ్డలందరికి పౌష్టికాహారం ఇవ్వాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి అన్నారు. మంగళవారం మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలో అంగన్‌వాడి టీచర్ల సెక్టార్ సమావేశంలో ఆమె మాట్లాడారు. చిన్నపిల్లల్లో పౌష్టికాహార సమస్యలు తలెత్తకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. చిన్నారుల బరువులు, ఎత్తులను కొలుస్తూ రిజిస్టర్లలో నమోదు చేయాలన్నారు.

సీనియర్ సిటిజన్లకు ఉచిత వైద్య పరీక్షలు

కామారెడ్డి అర్బన్: మహిళ, పిల్లల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కామారెడ్డి జిల్లా సీనియర్ సిటిజన్ ఫోరంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అల్లోపతి, ఆయుష్ వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అలాగే వయోవృద్ధులకు సీనియర్ సిటిజన్ కార్డులు అందజేయడానికి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి బావయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పి.రాజేశ్వర్, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు ఎం.రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

కాలభైరవుడికి సింధూర పూజలు



రామారెడ్డి(ఎల్లారెడ్డి): ప్రముఖ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న ఇసన్నపల్లి కాలభైరవుడికి మంగళవారం పర్వదినం సందర్భంగా సింధూర పూజలు జలాభిషేకాలు నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి జలాభిషేకాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కాలభైరవ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ చైర్మన్ ప్రభు గుప్తా, అర్చకులు శ్రీనివాస్ శర్మ, వంశీ కృష్ణ శర్మ, జూనియర్ అసిస్టెంట్ సురేందర్ పాల్గొన్నారు

ప్రారంభానికే పరిమితం!

- నాగిరెడ్డిపేట ఇంటర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభం కాని అడ్మిషన్లు
- వచ్చేఏడాది తరగతులు ప్రారంభమయ్యే అవకాశం



గోపాల్‌పేట హైస్కూల్‌లో ఇంటర్ కళాశాల కోసం కేటాయించిన గది

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న నాగిరెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల కేవలం ప్రారంభానికే పరిమితమైంది. మండల ప్రజలకు ఎన్నో ఏళ్లుగా కలగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఎట్టకేలకు ఎమ్మెల్యే జాజాల సురేందర్ చొరవతో మంజూరైంది. కాని కళాశాలలో ప్రవేశాలకు సంబంధించి లాగిన్ ఓపెన్ కాకపోవడంతో అడ్మిషన్లు ప్రారంభం కాలేదు. దీంతో ఈ ఏడాది నాగిరెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభానికే పరిమితమైంది.

మండల విద్యార్థుల ఇబ్బందులకు చెక్...

మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయడం వల్ల మండలంలోని వివిధ గ్రామాల విద్యార్థుల ఇబ్బందులు తీరనున్నాయి. గోపాల్‌పేట, నాగిరెడ్డిపేట, చీనూర్, వాడి, గోలిలింగాల, మాల్తుమ్మెద, పోచారం, లింగంపల్లి, బంజర, తాండూర్, మాటూర్, మాసాన్‌పల్లి, ధర్మారెడ్డి, రాఘవపల్లి, కన్నారెడ్డి, జప్తిజాన్కంపల్లి తదితర గ్రామాల విద్యార్థులు ప్రైవేట్ కళాశాలతోపాటు మోడల్ కళాశాలలో ఇంటర్ విద్యను అభ్యసిస్తున్నారు. వీరితోపాటు పక్కనే ఉన్న లింగంపేట మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి గ్రామానికి చెందిన విద్యార్థులు సైతం ఇంటర్ విద్య కోసం నాగిరెడ్డిపేట మండల కేంద్రానికే వస్తారు. చాలాకాలంగా నాగిరెడ్డిపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడం వల్ల ఆయా గ్రామాల విద్యార్థులు ఇంటర్ విద్యను అభ్యసించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా తెలుగు మీడియం అందుబాటులో లేకపోవడం వల్ల చాలామంది విద్యార్థులు ప్రైవేట్ కళాశాలలో అడ్మిషన్లు తీసుకొని ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారు. కొంత మంది నిరుపేద విద్యార్థులు ప్రైవేట్ కళాశాలలో జాయిన్ కాలేక చదువును మధ్యలోనే ఆపేశారు. ఇబ్బందులను గుర్తించిన ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఎట్టకేలకు గత నెల 7న నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ప్రారంభించారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ తెలుగు, ఇంగ్లీష్ మీడియంలలో తరగతులు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కాని కళాశాలలో అడ్మిషన్ల కోసం లాగిన్ రాకపోవడం మండల ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది.

లాగిన్ ఓపెన్ కావడం లేదు

నాగిరెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లకు సంబంధించి ప్రస్తుతం లాగిన్ ఓపెన్ కావడం లేదు. అడ్మిషన్లకు సంబంధించిన లాగిన్ ఓపెన్ కావడం కోసం ప్రయత్నం చేస్తున్నాం. లాగిన్ రాగానే అడ్మిషన్లు చేపడతాం.

– షేక్ సలాం, జిల్లా ఇంటర్ నోడల్ అధికారి, కామారెడ్డి

గ్రామ ముఖ ద్వారం పనుల అడ్డగింత

- అంబారిపేటలో ఫారెస్ట్ సిబ్బందితో గ్రామస్తుల వాగ్వాదం



అధికారులతో ఘర్షణకు దిగుతున్న గ్రామస్తులు

దోమకొండ: అంబారిపేట శివారులో మాచారెడ్డి మండలం ఫరీద్‌పేట–బీబీపేట మండలం జనగామ రోడ్డు వద్ద నిర్మిస్తున్న గ్రామ ముఖద్వార నిర్మాణ పనులను మంగళవారం ఫారెస్ట్ అధికారులు, సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో గ్రామస్తులకు ఫారెస్ట్ సిబ్బందికి మధ్య 2 గంటల పాటు వాగ్వాదం చోటుచేసుకుంది. నెల రోజుల క్రితం ప్రారంభించిన పనులు చివరి దశలో ఉన్నాయి. పనుల అనుమతి కోసం జిల్లా కలెక్టర్‌తో పాటు ఇతర జిల్లా శాఖ అధికారులకు గ్రామస్తులు వినతిపత్రం అందజేసి పనులు ప్రారంభించారు. మంగళవారం ఫారెస్ట్ బీట్ అధికారి నవీన్ పనులను అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. దీంతో దోమకొండ పోలీసులు అక్కడికి చేరుకుని ఇరు వర్గాలను సముదాయించారు. ఫారెస్ట్ ఉన్నతాధికారులతో గ్రామానికి చెందిన ఎంపీటీసీ ఫిరంగి రాజేశ్వర్, సింగిల్ విండో వైస్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. త్వరగా నిర్మాణ అనుమతి పత్రాలు అందించాలని వారు కోరగా.. దానికి వీరు అంగీకరించారు.

‘బహుజన రాజ్యంతోనే ప్రజల అభివృద్ధి’



మాట్లాడుతున్న బీఎస్పీ అభ్యర్థి సురేష్ గౌడ్

భిక్కనూరు: బహుజన రాజ్యంతోనే రాష్ట్రంతో పాటు ప్రజలందరూ అభివృద్ధి చెందుతారని కామారెడ్డి బీఎస్పీ అభ్యర్థి సురేష్ గౌడ్ అన్నారు. ఆయన మంగళవారం భిక్కనూరులో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ప్రవీణ్ కుమార్ ఇచ్చిన మాట ప్రకారం 60 మంది బహుజనులకు ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చారని, తనకు కూడా కామారెడ్డి టికెట్టును ఇచ్చారన్నారు. అవినీతి అక్రమాలకు తావు లేకుండా పాలనను అందిస్తానని, ప్రజలందరికి అందుబాటులో ఉండి సేవ చేస్తానన్నారు. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రజలను మోసగించేందుకు అమలుకాని హామీలిస్తున్నారని విమర్శించారు. బీఎస్పీ అధికారంలోకి వస్తే బహుజనులు రాజుల్లా బతుకుతారన్నారు. అంతకుముందు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బట్టెంకి బాల్‌రాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి భీమరి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు



ఎమ్మెల్యే జాజాల సమక్షంలో చేరుతున్న ఉత్తునూర్ గ్రామస్తులు



మాచారెడ్డిలో..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని ఉత్తునూర్ గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన సుమారు 200 మంది మంగళవారం ఎమ్మెల్యే జాజాల సురేందర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో విండో చైర్మన్ ప్రభాకర్ రావు, వీడీసీ చైర్మన్ దొడ్లె రవి, ఉప సర్పంచ్ శివపాటిల్ తదితరులు పాల్గొన్నారు.

మాచారెడ్డి: మాచారెడ్డి ఉమ్మడి మండలం రెడ్డిపేట, అన్నారం, పాల్వంచ, సోమారంపేట, ఘన్‌పూర్, చుక్కాపూర్ గ్రామాల నుంచి మంగళవారం పలువురు బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. రెడ్డిపేట మాజీ సర్పంచ్ మద్దికుంట నర్సాగౌడ్ కాంగ్రెస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసి మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఎంపీపీ నర్సింగరావు, జెడ్పీటీసీ రాంరెడ్డి, వైస్ ఎంపీపీ నర్సింహారెడ్డి, రైతు బంధు అధ్యక్షుడు నర్సింలు ఉన్నారు.

కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి భూసమస్యలు పరిష్కరిస్తా

- ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్ కొమ్ముల తిర్మల్‌రెడ్డి



భిక్కనూరు: రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యలన్నింటిని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నేత కొమ్ముల తిర్మల్‌రెడ్డి అన్నారు. మంగళవారం తిప్పాపూర్‌లో నిర్వహించిన రైతుల సమావేశంలో మాట్లాడారు. గ్రామంలో చాలామంది రైతులకు భూములు ఉన్నప్పటికి పాసుపుస్తకాలు లేవని, దీని వల్ల ఇబ్బంది కలుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్ స్వామి, ఎంపీటీసీల మండల ఫోరం కన్వీనర్ సాయిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వెంకట్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు వంగేటి చిన్న నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీసీలను విస్మరిస్తున్న పార్టీలకు గుణపాఠం చెబుతాం

ఎల్లారెడ్డి: బీసీలను విస్మరిస్తున్న రాజకీయ పార్టీలకు తగిన గుణపాఠం చెబుతామని బీసీ సంఘం అధ్యక్షుడు నీల నాగరాజు అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీలు బీసీలను విస్మరిస్తున్నాయని, 60 శాతం ఉన్న బీసీలకు 20 శాతం మాత్రమే సీట్లను కేటాయిస్తున్నాయన్నారు. జనాభా ప్రాతిపదికన రాజకీయంగా సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహేష్, ఆంజనేయులు తదితరులున్నారు.

సెస్ పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

రాజంపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నవంబర్ 3న నిర్వహించబోయే స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని మండల విద్యాధికారి(ఎంఈవో) రామస్వామి సూచించారు. మంగళవారం మండల విద్యా వనరుల కార్యాలయంలో సెస్ పరీక్ష సన్నద్ధతపై సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. విద్యార్థులలో కనీస అభ్యసన సామర్థ్యాలను అంచనా వేయడానికి 3, 6, 9 తరగతులు విద్యార్థులకు ఈ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలో 21 పాఠశాలలు ఈ సెస్ పరీక్షకు ఎంపికైనట్లు వెల్లడించారు.

బీఎస్పీకి రాజీనామా

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): బీఎస్పీ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి పదవికి, పార్టీకి రాజీనామా చేసినట్లు బబ్లూ మంగళవారం తెలిపారు. ఇక నుంచి పార్టీకి తనకు ఎలాంటి సంబంధం లేదని అన్నారు. తన వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రజల్ని మోసం చేసిన సురేందర్‌ను ఓడించండి

- ఎల్లారెడ్డి అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి మదన్ మోహన్



మదన్‌మోహన్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న ఎంపీటీసీ నర్సవ్వ, పలు గ్రామాల ప్రజలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్రజల చందాలతో గెలిచి వారికి అందుబాటులో ఉండకుండా, పత్తాలేకుండా పోయిన ఎమ్మెల్యే జాజాల సురేందర్‌ను తరిమికొట్టాలని ఎల్లారెడ్డి అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం గడపగడపకు తిరుగుతూ ప్రచారం చేశారు. అనంతరం పార్టీ కార్యాలయం వద్ద కార్యకర్తలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రజలు చందాలు వేసుకొని గెలిపిస్తే వారిని కలవక పోవడమే కాకుండా, వారికి ఎలాంటి సేవ చేయలేదని ఆరోపించారు. నాలుగున్నర సంవత్సరాలు నిద్రపోయిన ఎమ్మెల్యే సురేందర్ చేతకాని దద్దమ్మ అని విమర్శించారు. తాడ్వాయి మండలంలోని ఎర్రాపహాడ్‌లో చదివిన వాడిని, ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో తిరిగి కష్ట సుఖాలు తెలుసుకొని పలు సేవ కార్యక్రమాలు చేపట్టానన్నారు. జాబ్‌మేళాలు ఏర్పాటు యువతకు ఉద్యోగాలు ఇప్పించానని పేర్కొన్నారు. తాడ్వాయికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్యాంరావు, దేమికలాన్ బీఆరెస్ ఎంపీటీసీ నర్సవ్వతో పాటు పలు గ్రామాలకు చెందిన యువకులు, మహిళలు 500 మంది చేరారు. అలాగే ఒక్కనందివాడకు చెందిన 200 మంది పార్టీలో చేరారు.

ఇందిరా గాంధీకి ఘన నివాళులు



బాన్సువాడ : బీర్కూర్ మండల కేంద్రంలో మంగళవారం మాజీ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ 39వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బోయిని శంకర్ మాట్లాడుతూ.. పేదరికం పారదోలెందుకు ఇందిరా గాంధీ ఎంతో కృషి చేశారన్నారు. నాయకులు దొంతురాం కాశీరాం, రామారావు, రఫీ, పుల్లని పీరయ్య, తదితరులున్నారు.

బీఎల్ఎఫ్‌ను గెలిపించండి



కామారెడ్డి టౌన్: కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల్లో బీఎల్ఎఫ్ అభ్యర్థి సిద్ధి రాములును గెలిపించాలని ఆ పార్టీ నాయకులు మంగళవారం చిన్నమల్లారెడ్డి, సరంపల్లి గ్రామాల్లో జోరుగా ప్రచారం నిర్వహించారు. ప్రచార కరపత్రాలను ఓటర్లకు పంపిణీ చేసి ఓటు చేయాలని కోరారు. బహుజన రాజ్యం కోసం బీఎల్ఎఫ్‌ను గెలిపించుకోవాలని కోరారు. నాయకులు జగదీష్, సాయిబాబా తదితరులున్నారు.

జాతీయ సమైక్యతా దినోత్సవం



ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం అంగన్‌వాడి టీచర్లు జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా టీచర్లు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, సెక్టార్ నాయకులు వజ్ర, సంగమణి, భారతి, కమల, రాధ, సరస్వతి, గంగామణి తదితరులున్నారు.

అన్ని సంఘాల అభివృద్ధికి కృషి



ఆర్యవైశ్య సంఘ సభ్యులతో మాట్లాడుతున్న కేటీఆర్

కామారెడ్డి టౌన్: సీఎం కేసీఆర్ కామారెడ్డిలో గెలుపు కోసం మంత్రి కేటీఆర్ కామారెడ్డి పట్టణంలో సభ ముగించుకున్న తర్వాత హౌజింగ్ బోర్డులో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భవనంలో ఐఎంఏ అసోసియేషన్ వైద్యులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. కామారెడ్డిలో వైద్యరంగ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అలాగే ఆర్యవైశ్య, మున్నూరు కాపు, వెలమ, ముదిరాజ్ తదితర సంఘాల సభ్యులతో వేర్వేరుగా పట్టణ శివారులోని శుభం ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించారు. అన్ని సంఘాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, నిట్టు వేణుగోపాల్‌రావు తదితరులున్నారు.

గౌడ హాస్టల్ ఏర్పాటుకు హామీ

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి జిల్లా గౌడ విద్యార్థుల సంక్షేమ వసతి భవనానికి(హాస్టల్) రెండు ఎకరాల భూమి, రూ. రెండు కోట్లు మంజూరు చేయడానికి కేటీఆర్ హామీ ఇచ్చారని గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు జి.గోపి గౌడ్ తెలిపారు. మంగళవారం కామారెడ్డి పర్యటనకు వచ్చిన కేటీఆర్‌కు గౌడ సంఘం తరపున వినతి పత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు.

కేటీఆర్ సభ ఏర్పాట్ల పరిశీలన

దోమకొండ: దోమకొండలో బుధవారం మంత్రి కేటీఆర్ పాల్గొననున్న కాలేజీ గ్రౌండ్ సభా ప్రాంగణాన్ని బీఆర్ఎస్ పార్టీ మండలం అధ్యక్షులు గండ్ర మధుసూదన్ రావు, ఎంపీపీ శారద, జెడ్పీటీసీ తిరుమల్ గౌడ్, దోమకొండ సర్పంచ్ అంజలి తదితరులు పరిశీలించారు. దగ్గరుండి పనులను పర్యవేక్షించారు.

భిక్కనూరులో..

భిక్కనూరు: మండల కేంద్రంలో మంత్రి కేటీఆర్ బుధవారం పాల్గొనే బీఆర్ఎస్ బహిరంగ సభకు మంగళవారం రాత్రి ఏర్పాట్లను ప్రారంభించారు. సిరిసిల్లకు చెందిన ఈవెంట్ సంస్థ ఈ ఏర్పాట్లను పర్యవేక్షిస్తోంది. 120 మంది కార్మికులు ఈ పనుల్లో పాల్గొంటున్నారు. బుధవారం వేకువజాము వరకు ఏర్పాట్లు మొత్తం పూర్తవుతాయని ఈవెంట్ మేనేజర్ తెలిపారు.

సమాచారం..

నేడు గెస్ట్ ఫ్యాకల్టీ కోసం డెమో

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మర్కల్ స్టేజీ వద్ద గల మహిళ గురుకుల డిగ్రీ కళాశాలలో ఇంగ్లీష్ బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీ కోసం బుధవారం డెమో నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాధిక తెలిపారు. అర్హత గల మహిళా అభ్యర్థులు అన్ని స్టడీ సర్టిఫికెట్లతో డెమోకు హాజరుకావాలని ఆమె కోరారు.

ఎల్లారెడ్డికి మందకృష్ణ మాదిగ రాక

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండలంలో నిర్వహించే సమావేశానికి ఎంఆర్‌పీఎస్ నాయకులు మందకృష్ణ మాదిగ బుధవారం విచ్చేయనున్నట్లు ఎంఆర్‌పీఎస్ నాయకులు పద్మారావు మంగళవారం తెలిపారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుకు మద్దతు కోరేందుకు ఆయన కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

మద్నూర్‌లో సింధే ప్రచారం

మద్నూర్(జుక్కల్): మండలంలోని పలు గ్రామాల్లో రెండు రోజుల పాటు జుక్కల్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్‌సింధే ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింధే సలాబత్‌పూర్‌లోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ప్రచారం ప్రారంభించనున్నారు. బుధవారం సలాబత్‌పూర్, హండెకేలూర్, చిన్న శక్కర్గ, పెద్ద శక్కర్గ, గోజేగావ్, సోనాల, తడిహిప్పర్గాలో.. గురువారం అవాల్‌గావ్, పెద్ద తడ్గూర్, ఖరగ్, చిన్న తడ్గూర్, అంతాపూర్, సోమూర్‌లలో ప్రచారం నిర్వహిస్తారు.

ఇంటి పన్నులు సకాలంలో చెల్లించాలి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు సకాలంలో ఇంటి పన్నులను చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డిలో ఇంటి పన్నుల వసూలు కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని ప్రజలు ఇంటి పన్నులను చెల్లించి అభివృద్ధికి కృషి చేయాలని కమిషనర్ కోరారు.

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

బిచ్కుంద(జుక్కల్): రైతులు వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని బిచ్కుంద సొసైటీ సెక్రటరీ శ్రావణ్ అన్నారు. సొసైటీ ద్వారా వరి కొనుగోలు కేంద్రం ప్రారంభమైందని, మార్కెట్ యార్డు, తక్కడ్‌పల్లి రోడ్డు, మల్కాపూర్ శివారు హనుమాన్ మందిరం వద్ద కొనుగోలు కేంద్రాలు కొనసాగుతున్నాయని, రైతులు వీలును బట్టి ఆయా కాంటాలకు ధాన్యం తరలించుకోవచ్చని సూచించారు. రూ.2,203 ధరతో కొనుగోలు చేస్తున్నామని, 15 నుంచి 17 వరకు తేమ శాతం ఉండే విధంగా ధాన్యాన్ని ఆరబెట్టి రైతులు తీసుకురావాలన్నారు.

కేటీఆర్‌కు ఆటో కార్మిక జేఏసీ వినతి



కామారెడ్డి అర్బన్: కామారెడ్డిలో దళారీ వ్యవస్థను రద్దు చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ అధ్యక్షుడు కేటీ రామారావును కోరినట్లు ఆటో యూనియన్ ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా అధ్యక్షుడు బొదాసు నర్సింలు తెలిపారు. మంగళవారం కామారెడ్డి ఎన్నికల పర్యటనకు వచ్చిన కేటీఆర్‌ను ఆటో జేఏసీ నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో జేఏసీ నాయకులు రాజిరెడ్డి, ఇటుక నర్సింలు, ఎ.కృష్ణ, జి.రాజయ్య తదితరులు ఉన్నారు.

అంజాగౌడ్‌కు నివాళులు



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎకానమిక్స్ లెక్చరర్‌గా సేవలందించిన పి.అంజాగౌడ్ భౌతికంగా లేక పోయినా ఆయన అందించిన సేవలు శాశ్వతంగా అందరి హృదయాల్లో నిలిచిపోతాయని ప్రిన్సిపాల్ కే.విజయకుమార్ అన్నారు. అంజాగౌడ్ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందడంతో కళాశాలలో సంతాప సూచకంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.

సరైన నాయకుడిని ఎన్నుకోండి

మద్నూర్(జుక్కల్): ఓటరు మచ్చిక చేసుకోవడానికి ఎన్నికల్లో అభ్యర్థులు, నాయకులు దేనికి వెనుకాడరు. మండల కేంద్రంలో మంగళవారం బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ బీజేపీ అభ్యర్థి అరుణతారకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. వృద్ధురాలి కాలు మొక్కి సరైన నాయకులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.